క్లుప్తంగా

అధికారుల ఒత్తిడి బాధాకరం: సీఐటీయూ



ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

యాచారం: పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె విరమించి విధుల్లో చేరాలని అధికార యంత్రాంగం ఒత్తిడి తేవడం బాధాకరమని సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం చింతుల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ సిబ్బంది న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ధర్నాను అడ్డుకుంటే ఊరుకోమని హెచ్చరించారు.

పంచాయతీ కార్మికులకు అండగా ఉంటాం

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికులకు అండగా ఉండి పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు కావలి నర్సింహా అన్నారు. మంచాల మండలపరిధిలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు నర్ల శ్రీశైలం యాదవ్, నీలమ్మ, కృష్ణ, విజయ్‌కుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐకి సత్కారం



సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాంలను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లుకు నూతనంగా వచ్చిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాంలను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, బ్లాక్ ఉపాధ్యక్షుడు ఖలీల్, కృష్ణనాయక్, వస్పుల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సాయం

తలకొండపల్లి: పూల్‌సింగ్‌తండాకు చెందిన కిషన్‌నాయక్, గమిని దంపతుల కుమారుడైన అశోక్ అమెరికాలో ఉన్నత చదువులకు వెళుతున్న సందర్భంగా సర్పంచ్ బక్కి కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, చంద్రధన శుక్రవారం తండాకు వెళ్లి అశోక్‌నాయక్‌ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.


పొలాల్లో చేరిన వర్షపు నీటిని తొలగించాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్, ఆమనగల్లు, విఠాయిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాధార పంటలైన పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, ఇతర పంటలలో చేరిన వర్షపు నీటిని తొలగించాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే యూరియా, పొటాష్‌లాంటి ఎరువులను వేయాలని ఆమె సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కూలిన ఇల్లును చూస్తున్న యాదయ్య

తలకొండపల్లి: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చుక్కాపూర్‌కు చెందిన రాజుకుమార్ ఇల్లు గురువారం రాత్రి కూలిపోయింది. దీంతో మాజీ ఎంపీటీసీ యాదయ్య, తదితరులు పరామర్శించారు.

మున్సిపల్‌కు నూతన వాహనాలు

రూ.90లక్షలతో జేసీబీ, జెట్టింగ్ యంత్రాల కొనుగోలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.90లక్షల వ్యయంతో జేసీబీ, జెట్టింగ్ యంత్రాలను కొనుగోలు చేయగా శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి కౌన్సిలర్లతో కలిసి వాటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం

తక్షణ సాయంగా రూ.20వేలు • ప్రచారం లేక అమలు కాని పథకం

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబాన్ని పోషించే పెద్ద మరణిస్తే ఆదుకునే పథకం ఇది. ప్రచారం లేక ప్రజలకు దూరమైపోతుంది. స్థానిక అధికారులు అవగాహన కల్పిస్తే లబ్ధిదారులు దీన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వాలు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో అది నీరుగారుతుంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా సక్రమంగా అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి ఒకింత సాయంగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 1995లో ప్రారంభించింది.

తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేత

జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని(ఎన్‌ఎఫ్‌బీఎఫ్) నేషనల్ సోషల్ అసిస్టెంట్స్ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టింది. భారత ప్రభుత్వం 18 నుంచి 59 సంవత్సరాల లోపు ఉన్న వారికి ఈ పథకం వర్తింపచేస్తుంది. మొదటగా రూ.10వేల సాయం అందించే వారు. 2012, అక్టోబర్ 18న రూ.20 వేలకు పెంచింది. మళ్లీ అప్పటి ప్రభుత్వం రూ.10 వేలకు తగ్గించింది. 2017, ఏప్రిల్ 12న బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.20 వేలకు పెంచుతూ జీవో జారీ చేసింది. ఆమ్‌ఆద్మీ బీమా యోజన, జనశ్రీ బీమా యోజన, ఆపద్బాంధు పథకాలు అందని వారికి ఈ పథకం వర్తిస్తుంది. అత్యధికంగా ఆమ్‌ఆద్మీ బీమా యోజన, జనశ్రీ బీమా యోజన, ఆపద్బాంధు పథకాలపై ప్రచారం ఉంది. వీటి ద్వారా రూ. లక్ష సాయం అందుతుంది.

నీరుగారుతున్న పథకం..

ప్రచారం లేక జాతీయ కుటుంబ ప్రయోజన పథకం నీరు గారుతోంది. స్థానిక తహసీల్దార్లు, గ్రామస్థాయి అధికారులు అవగాహన కల్పించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



గ్రామస్థాయిలో ఈ పథకంపై అవగాహన లేక పోవడం వలన పథకం అందరికీ అందడం లేదు. కుటంబాన్ని పోషించే తల్లి, తండ్రి మరణిస్తే తప్పకుండా వారు లబ్ధిదారులే. తక్షణ సహాయం క్రింద ప్రభుత్వం నుంచి రూ.20 వేలు సహాయం అందుతుంది. రేషన్ కార్డు కలిగి ఉన్నా ప్రతీ ఒక్కరు అర్హులే. ప్రతీ లబ్ధిదారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – పి కృపేష్, ఎంపీపీ, ఇబ్రహీంపట్నం

దోచుకోవడమే బీఆర్ఎస్ ప్రభుత్వ పని



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్యగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రజాసమస్యలను పట్టించుకోకుండా కేసీఆర్ ప్రభుత్వంలో దోచుకోవడం..దాచుకోవడం పరిపాటిగా మారిందని బీజేపీ సీనియర్‌నేత, భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లష్కర్‌గూడ, మజీద్‌పూర్ గ్రామాల వంతెనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రహదారులపై వంతెనల నిర్మాణం, మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ఎమ్మెల్యే మచిరెడ్డిని ఆయన ప్రశ్నించారు. వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైన కూడా పనులు ఎందుకు చేయడంలేదన్నారు. తక్షణమే రెండు రోడ్లపై వంతెనల నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపీ బూర సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్త అశోక్‌గౌడ్, సీనియర్ నాయకుడు నోముల దయానంద్‌గౌడ్, బోసుపల్లి ప్రతాప్, వద్దేపల్లి పాపయ్యగౌడ్, పొట్టి రాములు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



కడ్తాల్: ఆలయ నిర్మాణ పనులకు సాయం అందించిన రాఘవేందర్‌రెడ్డి

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. గతంలో ముదిరాజ్ కులస్థులకు ఇచ్చిన హామీ మేరకు ఆలయ అభివృద్ధికి రూ.3లక్షలు అందజేశారు. పేదలకు విద్య, వైద్యం అందేవిధంగా కృషి చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు సాయం..

టాక్‌రాజ్‌గూడ గ్రామానికి చెందిన జగ్గనాయక్, ఆయన కుమారుడు అఖిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాఘవేందర్‌రెడ్డి అక్కడికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. లక్ష సాయం అందజేశారు. గోసుల కృష్ణయ్య, పూల శంకర్, బుచ్చమ్మ, రేఖ్యతండాకు చెందిన సభావత్ కృష్ణ, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, సర్పంచ్‌లు నరేందర్, సేవ్యానాయక్, హరిచంద్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, యువజన సంఘాల అధ్యక్షుడు రాఘవేందర్, మహేశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య ఘర్షణ సృష్టించొద్దు



ఎంపీ బాబురావ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజన నాయకులు

ఆమనగల్లు: లంబాడాల, ఆదివాసీల మధ్య ఘర్షణ సృష్టించొద్దని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అన్నారు. బీజేపీ ఎంపీ సోయంబాబురావ్ ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని కోరడాన్ని తీవ్రంగా ఖండిస్తూ హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గిరిజన సంఘాల నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టాలనే లక్ష్యంతోనే ఆందోళనకర పరిస్థితులను సృష్టిస్తున్నారని వారు ఆరోపించారు. లంబాడాల జోలికొస్తే ఎంపీ బాబురావ్‌ను తరమికొడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనునాయక్, పంతునాయక్, రమేశ్‌నాయక్, గన్యానాయక్, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, దశరథ్, శంకర్, హేమ్లు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

• ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లేశ్ మాదిగ



కడ్తాల్: మాట్లాడుతున్న ముదిగొండ ఎల్లేశ్ మాదిగ

కడ్తాల్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేశ్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మహేశ్వర నియోజకవర్గ నాయకులు కంద నర్సింహాతో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకొస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి మాటతప్పారన్నారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి నారాయణ స్వామి ఎస్సీ వర్గీకరణ చేయలేమని వ్యాఖ్యానించడం తగదన్నారు. ఈ విషయంలో ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు మాదిగలు మరో పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మల్లేశ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఎస్సీల వర్గీకరణతో మాదిగ, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో శుక్రవారం ఎంఎస్ఎఫ్ జిల్లా కోఇన్‌ఛార్జి శ్రీకాంత్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభ ఏర్పాటు గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీల వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు పరుశురాం, జిల్లా కో కన్వీనర్‌లు కృష్ణ, కిరణ్, అనిల్, శవరాజు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాడ్గులలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: మాజీ కేంద్రమంత్రి, దివంగత జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు నాయకులు పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, సర్పంచ్‌లు సేవ్యా, నరేందర్, ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న తెలంగాణ ఉద్యమ నాయకులు

చల్మారెడ్డికి...

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఉద్యమకారుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ జేఏసీ అధ్యక్షుడు వెదిరే చల్మారెడ్డికి ఉద్యమ నేతలు, బీఆర్ఎస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. డబ్బీకార్ శ్రీనివాస్, బర్ల జగదీశ్వర్‌యాదవ్, గాజుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తలకొండపల్లి: పడకల్‌లో ముదిరాజ్ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు బోళ్ల యాదిగిరి సమక్షంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా శివానందు, ఉపాధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, కోశాధికారిగా అంజయ్య, కార్యదర్శిగా రాము, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గానికి ధ్రువీకరణ అందజేస్తున్న యాదయ్య

బియ్యం పంపిణీ



తలకొండపల్లిలో మృతురాలి కుటుంబానికి బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన శాంతమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కార్యదర్శి పాండు ప్రసాద్ శుక్రవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయంతో పాటు 50కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతకుమారి, యాదయ్య, రమేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ మృతి.. పలువురి సంతాపం

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్ ఉపసర్పంచ్ యాతం అంజమ్మ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అంజమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

భూ సమస్యలను పరిష్కరించాలి

• వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం
• హాజరైన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



అక్రమణలపై సభలో మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా

కడ్తాల్: నూతనంగా ఏర్పడిన కడ్తాల్ మండలంలో భూ సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సభ దృష్టికి తెచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్ హాజరయ్యారు. కర్కల్‌పహాడ్ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్ గురువారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని ఎందుకు వాయిదా వేశారో చెప్పాలన్నారు. సభలో సభ్యుడు కానీ ఎంపీపీ భర్త, తనను దూషించడం తగదని దీనికి సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించాడు. దీంతో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్‌ల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ప్రధానంగా మండల పరిధిలో రైతులు భూ సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ తెలిపారు. సర్వే నెంబర్ 260లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సర్వేనెంబర్ 260కి సంబంధించి సమస్యలను, సీఎస్‌తో పాటు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గతేడాది, వడగండ్ల వానకు పంటనష్ట పోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్ ఉమావతి కో ఆప్షన్ జహంగీర్‌బాబా సభ దృష్టికి తెచ్చారు. కర్కల్‌పహాడ్ పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్ పేర్కొన్నారు. మక్తమాధారం పాఠశాలలో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని ఎంపీటీసీ మంజుల తెలిపారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంఈవో సర్దార్ పేర్కొన్నారు. కడ్తాల్‌కు మంజూరైన బాలికల గురుకుల పాఠశాలను వేరే ప్రాంతంలో నిర్వహిస్తున్నారని, వెంటనే కడ్తాల్‌లో ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించడం లేదని వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మిషన్ భగీరథ ద్వారా మైసిగండి, రావిచేడ్, గడ్డమీది తండాలలో సక్రమంగా నీటీ సరఫరా జరగడం లేదని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తులసీరాం, పాండునాయక్, ఎంపీటీసీ గోపాల్ సభ దృష్టికి తెచ్చారు. నీటి సమస్యను పరిష్కరించాలని ఏఈ శ్రావ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కో ఆర్డినేటర్ వీరయ్య, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, విజయలక్ష్మీ, సులోచన, ఎపీడీ సక్రియానాయక్, ఎంపీటీసీ నిర్మల, ఎంపీడీవో రామకృష్ణ, సీడీపీవో సక్కుబాయి, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, ఎంపీవో మధుసూదనచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సామూహిక కుంకుమార్చన



ఆమనగల్లులో కుంకుమార్చనలో మహిళలు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం ఆర్య వైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో అధిక శ్రావణమాసం సందర్భంగా కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

రైతుబీమాపై అవగాహన

తలకొండపల్లి: జూలపల్లిలో రైతుబీమాపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. అర్హులైన రైతులందరు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా రైతులందరికి రైతుబీమా వర్తింప జేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 5 చివరి గడువనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు తీసుకుంటున్న ఏఓ, తదితరులు

అక్రమ నిర్మాణాల తొలగింపు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పస్మాములలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..మండల పరిధిలో కొందరు ఇల్లు నిర్మించుకుని జీఓ 59 కింద రెగ్యులరైజ్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నెంబర్ 444లోని అసైన్డ్ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు స్పందిచి జేసీబీ సహాయంతో దాన్ని తొలగించారు.



జేసీబీతో తొలగిస్తున్న నిర్మాణాలు